నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 25 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD









చెన్నూర్ ప్రాంతంలో వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ రిసోర్స్ పర్సన్స్ గుర్తించిన వివిధ రకాల పక్షులు

# అరుదైన అతిథులు

- చెన్నూర్ అటవీ ప్రాంతంలో రకరకాల పక్షులు, సీతాకోకలు
- వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ రిసోర్స్ పర్సన్ల అధ్యయనంలో గుర్తింపు

చెన్నూర్ అటవీ సబ్ డివిజన్ ప్రాంతం అరుదైన పక్షి జాతులు.. సీతాకోక చిలుకలు.. ఇతర జీవాలకు నిలయంగా మారింది. వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ రిసోర్స్ పర్సన్లు రెండు రోజుల నుంచి గొల్లవాగు ప్రాజెక్టు, శివ్వారం, జోడు వాగులు, అంబేద్కర్ అర్బన్ పార్కు, గోదావరి నదీ తీరంలో పర్యటించి పక్షి జాతులు, జీవరాశులపై అధ్యయనం చేశారు. ఈ ప్రాంతంలో 75 రకాల పక్షులు, ఇందులో 25 రకాల విదేశీ పక్షి జాతులు, సూడ సక్కని సీతాకోక చిలుకలు ఉన్నట్లు వారు గుర్తించారు. భౌగోళికంగా చూస్తే చెన్నూర్ అటవీ సబ్ డివిజన్ ఉత్తర, దక్షిణ భారత దేశానికి మధ్యలో ఉందని, నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండే పక్షి జాతులు ఇక్కడ అధికంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో ముందుందు మరిన్ని అధ్యయనాలు చేస్తామని పేర్కొన్నారు. కాగా, యేటా చలికాలంలో దేశ విదేశాల నుంచి అరుదైన పక్షులు ఈ ప్రాంతానికి వలస వచ్చి విడిది చేయడం.. గోదావరి నదీ తీరంతో పాటు వాగులు.. వంకలు.. సెలయేళ్ల వద్ద కిలకిల రావాలతో సందడి చేయడం కనిపిస్తూ ఉంటుంది.

- చెన్నూర్, నవంబర్ 24









చెన్నూర్ ప్రాంతంలో వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ రిసోర్స్ పర్సన్స్ గుర్తించిన పలు రకాల సీతాకోక చిలుకలు







చెన్నూర్ అటవీ సబ్ డివిజన్ పరిధిలో అధికారులతో కలసి పక్షులు, సీతాకోక చిలుకలను పరిశీలిస్తున్న వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ రిసోర్స్ పర్సన్స్

# పులి పంజా

- కోర్ డోబ్రా లొద్ది అటవీ ప్రాంతంలో పశువుల మందపై దాడి
- నాలుగింటికి గాయాలు
- సరిహద్దు పల్లెల్లో భయాందోళనలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : వాంకిడి మండలం కోర్ డోబ్రా లొద్ది అటవీ ప్రాంతంలో ఆదివారం పశువుల మందపై పులి పంజా విసిరింది. డాబా గ్రామానికి చెందిన సోయం బాపురావు పశువులను తోలుకొని డోబ్రా లొద్ది అటవీ ప్రాంతానికి వెళ్లగా, పులి ఒక్కసారిగా దాడి చేసింది. సోయం బాపురావుకు చెందిన రెండు ఆవులు, సెడ్మకి జమునా బాయికి చెందిన లేగదూడ, మరో పశువు తీవ్రంగా గాయపడ్డాయి. పశువుల కాపరి కేకలు వేయడంతో పులి అడవుల్లోకి పారిపోయింది. ఘటనా స్థలాన్ని అటవీ అధికారులు రేంజర్ గోపి చంద్‌సర్దార్, డిప్యూటీ రేంజర్ సరోజా రాణి, సవాతి, బీఆర్ అధికారి నాగేందర్, యానిమల్ ట్రాకర్స్ సందర్శించారు. గతేడాది పిప్పర్‌గొంది-చౌపన్‌గూడ అటవీ ప్రాంతంలో పులి పుశువులపై దాడి చేసిన విషయం విదితమే.

## పల్లెలను వీడని భయం..

కొద్ది రోజులుగా అటవీ గ్రామాల్లో పులి సంచరిస్తుండగా, గిరిజనం భయంతో వణికిపోతున్నది. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి తమపై దాడి చేస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. పులి మహారాష్ట్రకు వెళ్లిపోయిందని అధికారులు ప్రకటించిన మరుసటి రోజే కోర్‌డోబ్రా గ్రామ సమీపంలో నాలుగు పశువులపై దాడి చేయడం కలకలం రేపుతున్నది. పులిదాడి జరిగిన కోర్ డోబ్రా గ్రామానికి సమీపంలో బండకస, దాబా, సవాతి, అంతపూర్, గోండ గ్రాం గ్రామాలున్నాయి. పులి దాడి ఘటనతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. పులిని ట్రాక్ చేయడంలో అటవీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పులి దాడి ఘటనపై వివరాలు సేకరిస్తున్న అటవీ అధికారులు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జైనూర్, నవంబర్ 24 : పులి సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జైనూర్, కెరమెరి ఎఫ్‌ఆర్వోలు మజారుద్దీన్, జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. గౌరి, కొలాంగూడ గ్రామాల్లో ఆదివారం అవగాహన కల్పించారు. రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని సూచించారు. పులి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

# నేరాల నివారణకే కార్డన్ సెర్చ్

శ్రీరాంపూర్ ఆర్కే-6 గుడిసెలు కొత్తరోడ్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు



- వాడవాడలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు
- శ్రీరాంపూర్‌లో నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు

శ్రీరాంపూర్, నవంబర్ 24 : నేరాల నివారణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నటు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కే-6 గుడిసెలు, కొత్తరోడ్‌లోగల కాలనీలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఆధ్వర్యంలో పోలీసులు నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్‌లతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నార్కోటిక్ డ్వాగ్‌స్క్వాడ్‌లతో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనంతరం కమ్యూనిటీ కాంటాక్ట్ సమావేశం నిర్వహించారు. ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వేణుచందర్ మాట్లాడుతూ దొంగతనాల నివారణకు వాడవాడలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీల్లో అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి, మద్యం సేవించరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురికావద్దన్నారు. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. గంజాయి విక్రయిస్తూ దొరికితే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో అనుమతి పత్రాలు లేని 40 మోటార్ సైకిళ్లు, 5 ఆటోలను పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోస్, శ్రీధర్, లక్ష్మిప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.



ప్రతాలను ఆచరిస్తున్న దంపతులు

# సత్యదేవుని సన్నిధిలో కార్తీక పూజలు

దండేపల్లి, నవంబర్ 24 : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులతో రద్దీ కనిపించింది. ఆదివారం సెలవు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సత్యదేవున్ని దర్శించుకున్నారు. గుట్టపైన ఆలయ ప్రాంగణం, గుట్ట కింద రాగిచెట్టు వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. సుమారు 600 జంటలు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ అన్ని సౌకర్యాలు కల్పించారు.

# పక్షిజాతులను కాపాడుకోవాలి

- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్



మాట్లాడుతున్న డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

చెన్నూర్, నవంబర్ 24 : పక్షజాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పేర్కొన్నారు. చెన్నూర్ అటవీ సబ్ డివిజన్ ప్రాంతంలోని గొల్లవాగు,శివ్వారం, జోడువాగుల అంబేద్కర్ అర్బన్ పార్కు, గోదావరి నదితీరంలో నివసించే పక్షులు, కీటకాలు, ఇతర జీవరాశుల జీవనశైలీ, వాటి మనుగడపై రెండు రోజుల పాటు అధ్యయనం చేశారు. ఆదివారం స్థానిక అటవీ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జీవరాసులు మానవ మనుగడకు ఎంతో దోహదపడుతాయన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో నివసించే పక్షి జాతులపై మరిన్ని అధ్యయనాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) రీసోర్స్ పర్సన్స్ హర్షవర్ధన్, సోహబ్, చెన్నూర్, నీల్వాయి ఎఫ్‌ఆర్వోలు శివకుమార్, అప్పలకొండ, డీఆర్వో ప్రభాకర్ ఉన్నారు.



గురువులతో తాండూర్ జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

# అపూర్వ సమ్మేళనం

తాండూర్, నవంబర్ 24 : మండల కేంద్రంలోని సురభి గోదాక్షేత్ర గార్డెన్స్‌లో ఆదివారం తాండూర్ జడ్పీహెచ్‌ఎస్ 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులంతా ఒకే వేదికపై చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను నెమరేసుకున్నారు. ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం అప్పటి గురువులు ఎస్ రామ్మోహన్‌రావు, ఎం రామ్మోహన్‌రావు, జగన్నాథరావు, సురేందర్, రవి, సుభాంగిణిని ఘనంగా సత్కరించారు. ఆర్థిక స్థోమత లేని తోటి స్నేహితులకు ఆర్థిక సాయం చేశారు.